



సమీక్ష సమావేశంలో కలెక్టర్ టిఎస్.చేతన్

శింగనమల ఫ్యాన్‌లో అయోమయం..!

◆ శైలజానాథ్ ఆపార్టీలోకి వెళ్తారంటూ ప్రచారం
◆ ఇదే జరిగితే సాంబశివారెడ్డి దారెటు..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల నియోజకవర్గం వైసిపిలో అయోమయం నెలకొంటోంది. ఆ నియోజకవర్గంలో ఇప్పటికే అధికార టిడిపిలో కుంపట్లు నడుస్తున్నాయి. అదే పరిస్థితి ప్రతిపక్ష వైసిపిలోనూ నెలకొంటోంది. మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డి శింగనమల వైసిపి రాజకీయ వ్యవహారాలు చక్కబెట్టేవారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వారిని తప్పించారు. వారు సూచించిన వ్యక్తి టిప్పర్ డ్రైవర్ వీరాంజినేయులుకు గత ఎన్నికల్లో టిక్కెట్టు ఇచ్చారు. ఆయన టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత ఆయన కనిపించలేదు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను ఆలూరు సాంబశివారెడ్డి ఇప్పుడు చూస్తున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన వీరాంజినేయులు తిరిగి పాత వృత్తిలోకి వెళ్లినట్టు నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది. ఆయన ఇటీవల పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్షకు వెళ్లలేకపోయారు. ఇదే సమయంలో మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని కర్నూలు జిల్లాలో జరిగిన ఓ పెళ్లిలో కలవడం చర్చనీయాంశం అయ్యింది. ఎన్నికలకు ముందే శైలజానాథ్ కాంగ్రెస్ పార్టీని వీడి టిడిపిలో చేరుతున్నట్టు ప్రచారం నడిచింది. ఇది జరగలేదు. కాంగ్రెస్ పార్టీలోనే ఉండటమే కాకుండా ఆ పార్టీ తరుపున ఎన్నికల్లోనూ పోటీ చేశారు. ఆశించిన ఓట్లు ఏమీ పెద్దగా ఆయనకు రాలేదు. ఈ తరుణంలో ఇప్పుడు వైసిపి వైపు చూస్తున్నారనే ప్రచారం నడుస్తోంది. శైలజానాథ్ వైసిపిలో చేరితో శింగనమల నియోజకవర్గ బాధ్యతలు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అందుకు ఇద్దరు సీనియర్ నాయకులు కూడా మద్దతునిస్తున్నట్టు వైసిపిలో చర్చ నడుస్తోంది. ముందు నుంచి వైసిపిలో ఆలూరు సాంబశివారెడ్డిని వ్యతిరేకిస్తున్న నేతలున్నారు. కొన్ని సందర్భాల్లో అవి బాహాటంగానే బయటకొచ్చాయి. ఇప్పుడు శైలజానాథ్ వైసిపిలోకి వచ్చి శింగనమల బాధ్యతలిస్తే ఇక ఆలూరు సాంబశివారెడ్డికి నియోజకవర్గంలో రాజకీయ వ్యవహారాలు చూడటం కష్టసాధ్యమవుతుందన్న చర్చ నడుస్తోంది. శైలజానాథ్‌కు ముందు నుంచి శింగనమల నియోజక వర్గంపై పట్టుంది. అది కూడా గతంలో కాంగ్రెస్, ఇప్పుడు వైసిపి నేతలుగా నున్న అందరితోనూ సంబంధాలుండటంతో ఆయన నియోజకవర్గంపై పూర్తిస్థాయి పట్టు సాధించే అవకాశముంది. అప్పుడు ఆలూరు సాంబశివారెడ్డి పట్టుకోసం ప్రయత్నిస్తారా లేక పక్కకు తప్పుకుంటారా అన్నది చూడాల్సి ఉంది. ఈ ఇద్దరి మధ్య పట్టుకోసం ప్రయత్నాలు నడిస్తే గ్రూపులు ఫ్యాన్‌లో స్పష్టంగా నెలకొనే అవకాశాలు లేకపోలేదు. ఏది ఏమైనా శింగనమల నియోజకవర్గంలో అటు అధికార టిడిపి, ఇటు ప్రతిపక్ష వైసిపిలోనూ సొంత పార్టీలో కుంపట్లు వేడిని పుట్టించే విధంగా ఉంటున్నాయి.



ఇటీవల ఓ వివాహ కార్యక్రమంలో జగన్‌ను కలిసి మాట్లాడుతున్న శైలజానాథ్(ఫైల్‌ఫొటో)

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఉద్యోగి పటిష్టమైన చర్యలు తీసుకోవడానికి కృషి చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనపై గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమన్వయ సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ, వి. రత్న, డిఆర్ఒ విజయసారథి, ఐసిడిఎస్ పీడీ సుధా వరలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆర్డీవోలు, సిడిపిఒలు, అంగన్వాడీలు, పోలీసులు, బాల్యవివాహాల నిరోధక కమిటీ సభ్యులు కీలక పాత్ర వహించాలన్నారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు 105 బాల్య వివాహాలు నిలుపుదల జరిగినట్లు తెలుస్తోందన్నారు. గ్రామాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు, మహిళా పోలీసులు, వీఆర్వోలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతినెల డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బాలికలపై జరుగుతున్న లైంగిక నేరాలు అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసిన తల్లిదండ్రుల తోపాటు ప్రోత్సహించేవారు కూడా శిక్షార్హులేనన్నారు. 18 సంవత్సరాలు నిండని అమ్మాయిలకు, 21 ఏళ్లు నిండని అబ్బాయిలకు వివాహాలు చేస్తే చట్ట ప్రకారం నేరం అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు సువర్ణ, ఆనంద్, శర్మ, మహేష్, డిఆర్‌డిఎ పీడీ నర్సయ్య, డిపిఒ సమత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు కృషి

పుట్టపర్తి క్రైమ్ : జిల్లాలో అన్యాక్రాంతమైన అటవీ భూములను గుర్తించి తిరిగి వాటిని స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, ఫారెస్ట్ రేంజర్లు సరస్వతి శ్రీనివాస్ రెడ్డి, గుర్రప్ప వివిధ శాఖ అధికారులు పలు స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ పోలీస్ అటవీ తదితర శాఖలు స్వచ్ఛంద సేవా సంస్థల సమన్వయంతో అడవికి సంబంధించిన నేరాలను అరికట్టుటకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. అడవి ప్రాంతంలో కొండలకు నిప్పు పెట్టకుండా గ్రామస్థాయిలో పర్యవేక్షణ చర్యలు తీసుకుని పశు ప్రాణ సంరక్షణతో పాటు అడవులను నిప్పు పెట్టే చర్యల నుండి కాపాడాలన్నారు. దీనికై విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, పెనుగొండ ఆర్డీవో ఆనంద్, కదిరి ఆర్డీవో శర్మ, ధర్మవరం ఆర్డీవో మహేష్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఒ సమత, డివో కృష్ణయ్య, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించాలి

సమాజంలో వివిధ కారణాలవల్ల సతమతమవుతున్న వయో వద్ధుల సమస్యలను మానవతా దక్పథంతో పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ వి.రత్న డిఆర్ఒ విజయసారథి, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో కలిసి తొలిసారి వయోవద్ధుల సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి డివిజన్లో తప్పనిసరిగా వయోవద్ధులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వయోవద్ధుల పోషణ, సంక్షేమ చట్టం -2007, వయోవృద్ధుల సంరక్షణ నియమావళి-2011ను అవగాహన చేసుకుని ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో వికలాంగుల శాఖ ఏడీ రసూల్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి మంజువాణి, డిసిహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, డిఆర్‌డిఎ పీడీ నర్సయ్య ఆర్డీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న

యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(కె.పి)లో గురువారం యుటిఎఫ్ మండల అధ్యక్షులు మాలింగప్ప, రొళ్ల మండల అధ్యక్షులు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రచారజాత సన్నాహక సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, జిల్లా కార్యదర్శి డి.నరసిం హప్ప మాట్లాడుతూ జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయడంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి ప్రచారజాత, ర్యాలీ, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపడతామని, అందులో మడకశిర, గుడిబండ, అమరాపురం, అగళి, రొళ్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మడకశిర గౌరవాధ్యక్షులు నరసింహమూర్తి, నాయకులు నంజప్ప, కదురన్న, చిన్న కృష్ణ పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న ఎడిఎ స్వయంప్రభ, ఏవో చందన

రాగి సాగు విస్తీర్ణం పెంచాలి

ప్రజాశక్తి-పెనుకొండ

రైతులు పంటల బీమా ప్రీమియంను సకాలంలో చెల్లించాలని డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు స్వయంప్రభ సూచించారు. మండలంలోని గుట్టూరు రైతు సేవా కేంద్రంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎడిఎ మాట్లాడుతూ రాగి పంట సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన క్రాప్ ఇన్సూరెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవో కెసి.చందన మాట్లాడుతూ వరి, వేరుశనగ, మామిడి పంటలకు రైతులు ఈ నెల 31వ తేదీ లోపు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని కోరారు. ఒక ఎకరా వరికి రూ. 630 చెల్లిస్తే రూ. 42వేలు, వేరుశెనగకు రూ. 480 చెల్లిస్తే రూ. 32వేలు, మామిడికి రూ. 1800 ప్రీమియం చెల్లిస్తే రూ. 36 వేలు బీమా వర్తిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ ఎం.అశోక్‌కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది భానుశ్రీ, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

'పది' మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-రొద్దం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి పరీక్షల మోడల్ పేపర్లను గురువారం మండలంలోని తురకలాపట్నం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పంపిణీ చేశారు. తురకలాపట్నం ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం శివయ్య సహకారంతో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిసి.నరేష్‌కుమార్ ఆధ్వ ర్యంలో 40 మంది విద్యార్థులకు మోడల్ పేపర్స్‌ను ఉచితంగా అందజేశారు. శివయ్య, నరేష్‌కుమార్ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికకు అనుకూలంగా ఈ మోడల్ పేపర్లను తయారు చేశామని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు సానిపల్లి గంగాధర్, నాయకులు పోతులయ్య, నరసింహప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బూదిలి సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో సువర్ణ

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-గోరంట్ల

గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ఆర్డీవో సువర్ణ తెలిపారు. మండలంలోని బూదిలి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో సువర్ణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్డీవో మాట్లాడుతూ భూ సమస్య ఉన్న రైతులు అర్జీ ఇస్తే పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పుట్టపర్తి నుంచి కోడూ రు వరకూ బూదిలి మీదుగా నాలుగు లేన్ల జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఆ రోడ్డు విస్తరణలో భాగంగా తాము నివాసం ఉంటున్న ఇళ్లను తొలగించారని, నష్టపరిహారం కూడా తక్కువ ఇచ్చారన్నారు. కావున తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ బూదిలి గ్రామ ఎస్సీ కాలనీవాసులు వినతిపత్రం ఇచ్చారు. సదస్సులో తహాశీల్దార్ మారుతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు



బూదిలి సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో సువర్ణ

అనుభవదారులకు అసైన్డ్ పట్టా ఇవ్వాలి

సోమందేపల్లి : తరతరాలుగా అనుభవంలో ఉన్న భూమికి అసైన్డ్ పట్టా కేటాయించాలని కోరుతూ నాగినేయినిచెరువు తండావాసులు మండలంలోని గుడిపల్లి సచివాలయ పరిధిలో నిర్వహిం చిన రెవెన్యూ సదస్సులో తహాశీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతి పత్రం ఇచ్చారు. తండాకు సమీపంలోని సర్వే నెంబర్-6లో ఉన్న 7 ఎకరాల భూమిలో తరతరాలుగా సుమారు 40 కుటుంబాలకు చెందిన వ్యక్తులు గడ్డి వాములు, పశువుల పాకలు వేసుకున్నామని, పంట నూర్పిడి, తదితర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులు అధికారులతో కలిసి ఈ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి ప్రయత్నాలను తిప్పికొట్టి అనుభవంలో ఉన్న తమకు డి పట్టా ఇచ్చి హక్కుదారులను చేయాలని కోరారు. కార్యక్రమంలో తిప్పేనాయక్, రంగేనాయక్, భీమ్లా నాయక్, చంద్రనాయక్, శీనానాయక్, సోమ్లానాయక్, శంకర్‌నాయక్, అనుభవదారులు పాల్గొన్నారు.

మడకశిర : మండలంలోని గౌడనహళ్లి పంచాయతీలోని జమ్మానిపల్లి, తురకవాండ్లపల్లి, గౌడన హళ్లి గ్రామాలకు సంబంధించి రెవెన్యూ సమస్యలపై గౌడనహళ్లిలో తహాశీల్దార్ కరుణాకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజలు, రైతుల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సదస్సులో సర్వేయర్లు హరీష్, రాజశేఖర్, గ్రామ రెవెన్యూ అధికారి చరణ్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న ఎడిఎ స్వయంప్రభ, ఏవో చందన

ఈవ్ టీజింగ్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఈవ్ టీజింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు విద్యార్థులకు ర్యాగింగ్, డ్రగ్స్ వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. వాటి జోలికి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎవరైనా బాలికలను ఈవ్ టీజింగ్ చేసినా, ఏ ఇతరత్రా సమస్యలు సృష్టించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సదస్సులో ఎస్ఐ నరేంద్ర, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సిడబ్ల్యుసి సమావేశానికి రఘువీరా హాజరు

ప్రజాశక్తి-మడకశిరరూరల్

కర్నాటకలోని బెల్గావిలో గురువారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సిడబ్ల్యుసి) సమావేశానికి సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి హాజరయ్యారు. సమావేశంలో సిడబ్ల్యుసి సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు, పిసిసి అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, కాంగ్రెస్ మాజీ ముఖ్య మంత్రులు, తదితరులు పాల్గొన్నారు.



సిడబ్ల్యుసి సమావేశానికి హాజరైన రఘువీరా

వైసిపి పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మడకశిర

కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మోపిన విద్యుత్ భారాలకు నిరసనగా శుక్రవారం చేపట్ట నున్న 'వైసిపి పోరుబాట'ను జయప్రదం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన అగళి, రొళ్లలో 'వైసిపి పోరుబాట' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయు కడప జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సాయి ఆరామంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జోనల్ సంయుక్త కార్యదర్శి శ్రీ రామ్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాకమునుపు ఉన్న అపరిమిత వైద్య సౌకర్యమును కొనసాగించాలని, పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, అన్ని గ్యారేజీల్లో సాంకేతిక పరికరాలు సమకూర్చాలని, అన్ని కేటగిరీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయు రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ నిరంతరం కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాజీ లేని పోరాటాలు చేస్తున్నామన్నారు. విజయవాడ యూనియన్ కు సొంత కార్యాలయ నిర్మాణం కోసం విరాళాలు అందించాలని కోరారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగులు విరాళాలు ప్రకటించారు. అనంతరం పుట్టపర్తి నూతన డిపో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా రీజినల్ ఉపాధ్యక్షుడు కేశప్ప, ఉపాధ్యక్షురాలు తిరుపతమ్మ, జిల్లా కార్యదర్శి షబ్బీర్, రవితేజ, చెనరాయుడు గ్యారేజీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మడకశిర

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రోడ్ల సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని కల్లుమర్రి సర్పంచి నాగరాజు తెలిపారు. మండలంలోని కల్లుమర్రి గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో నూతనంగా సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరామ్ స్వామి, నారాయణగౌడ్, వైస్ సర్పంచి నరసన్న, శారద, పెద్దమూర్తి, డీలర్ మధుసూదన్, నాగభూషణ్, నాయకులు నారాయణగౌడ్, మల్లేశప్ప, వెంకటేష్, రామలింగప్ప, మూర్తి, కొండప్ప, ముని పాల్గొన్నారు.

కనకదాసు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కల్లుమర్రి గ్రామంలో గురువారం కురుబల ఆరాధ్య దైవం కనకదాసు విగ్రహ ఏర్పాటు చేయుటకు భూమి పూజ చేశారు. నాయకులు మాట్లాడుతూ కనకదాసు విగ్రహ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి నాగరాజు, వైస్ సర్పంచి నరసన్న, ఆయకట్టు అధ్యక్షులు పెద్దమూర్తి, నాయకులు నారాయణగౌడ్, మల్లేశప్ప, రామలింగప్ప, బసప్ప, నాగభూషణ, అంజనప్ప పాల్గొన్నారు.

తండాలో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కె.గుండుమల పంచాయితీలోని కెఎస్.తండాలో తాగునీటి సమస్య పరిష్కారమై నట్లు సర్పంచి కరియన్న, మాజీ సర్పంచి గుండుమల చంద్రప్ప తెలిపారు. తండాలో నెలకొన్న తాగు నీటి సమస్యను మాజీ సర్పంచి చంద్రప్ప ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ గ్రామంలో బోరు వేయించగా నీరు పుష్కలంగా పడ్డాయి. దీంతో గ్రామస్తులు చంద్రప్పను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పాండురంగప్ప, నాయకులు దొరస్వామి, డీలర్ తిప్పేస్వామి, కృష్ణమూర్తి నాయక్, వెంకట నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



బోరుబావి వద్ద చంద్రప్పను సన్మానించిన గ్రామస్తులు

విద్యుత్ భారాలపై వైసిసి లాంతర్ల ర్యాలీ

ప్రజాశక్తి-గోరంట్ల

కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మోపిన విద్యుత్ భారాలకు నిరసనగా గురువారం రాత్రి వైసిపి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. పట్టణంలో వాసవీ మహల్ నుంచి బస్టాండ్ వరకూ లాంతర్లతో ర్యాలీ నిర్వహించారు. ఉషశ్రీ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడంతో సామాన్యునికి గుదిబండగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక తహాశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో గురువారం 2025-ప్రజాశక్తి క్యాలెండర్‌ను తహాశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపిడిఒ నరసింహామూర్తి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రజాశక్తి క్యాలెండర్‌ను మంచి చిత్రాలతో సందేశాత్మకంగా రూపొందించడం చాలా బాగుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ కుమార్‌రెడ్డి, సెక్రటరీలు రమేష్‌బాబు, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న ఎడిఎ స్వయంప్రభ, ఏవో చందన

కల్లు దుకాణానికి నిప్పు

ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రమైన రొద్దంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ కల్లు దుకాణానికి నిప్పు పెట్టారు. వివరాలు.. ఈడిగ శ్రీనివాసులు రొద్దం నుంచి కందుకూర్లపల్లి గ్రామం వెళ్లే దారిలో గ్యాస్ గోడౌన్ వద్ద రోడ్డు పక్కన కల్లు దుకాణం నిర్వహించేవాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దుకాణానికి నిప్పు పెట్టడంతో కాలి బూడిదైంది. గురువారం ఉదయం దుకాణం వద్దకు వెళ్లిన శ్రీనివాసులు అది చూసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనతో దాదాపు రూ. 50వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం సాయం చేయాలని బాధితుడు శ్రీనివాసులు కోరాడు.



దహనమైన కల్లు దుకాణం వద్ద ఈడిగ శ్రీనివాసులు

షోకాజ్ నోటీసుతోనే సరిపెట్టేరా..?

కొనసాగుతున్న సర్వేయర్ మాయాజాలం
ఇచ్చిన డబ్బులు వెనక్కివ్వాలని నడిబజార్లో రైతు నిలదీత
జిల్లాస్థాయి అధికారి అండదండలున్నాయన్న విమర్శలు



ఇటీవల నడిరోడ్డులో సర్వేయర్‌ను నిలదీస్తున్న రైతు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి సర్వేయర్ అవినీతి భాగోతాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆయనపై వచ్చిన ఆరోపణలకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన అధికారులు అంతటితోనే సరిపెట్టారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. మండలంలోని పలువురు రైతులు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్, హద్దులు, కొలతలకు సర్వేయర్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. సర్వేయర్ భాగోతంపై ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా స్థాయి అధికారులు సర్వేయర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇప్పటిదాకా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియడం లేదు. అయినా ఆ సర్వేయర్ తన పనితీరు మార్చుకోలేదన్న అభిప్రాయాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. పనుల కోసం వచ్చే రైతులను తనచుట్టూ తిప్పించుకుంటే విసిగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కాసులు ఇవ్వందే పనులు చేయడన్న విమర్శలు ఎదుర్కొంటున్న ఆ సర్వేయర్ డబ్బులు ముట్టజెప్పిన రైతులకు కూడా పనులు చేయకుండా తనచుట్టూ తిప్పించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కదిరి మండలం కాళాశముద్రం గ్రామానికి చెందిన సయ్యద్‌భాషా కుటుంబీకులు ఏళ్ళతరబడి సాగు చేసుకుంటున్న భూమి సర్వే కొలతలు, ఎంజాయ్ మెంట్ కోసం సర్వేయర్ చుట్టూ తిరుగుతున్నారు. రైతు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులతో పాటు సంతకాలు చేయించుకున్న సర్వేయర్ రూ.40 వేలు డబ్బులు కూడా తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. డబ్బులు సైతం ఇచ్చినా ఇంతవరకు ఆ రైతు పని పూర్తికాలేదని తెలుస్తోంది. తన పనికోసం సర్వేయర్ చుట్టూ తిరిగిన ఆ రైతు విసిగిపోయి నడిరోడ్డుపై నిలదీశాడు. ఇటీవల జరిగిన ఈ ఉదంతం సోషల్‌మీడియాలో వైరల్ కూడా అయింది. డబ్బులు ముట్టజెప్పినా ఇంతరకు పనిచేయలేదని విసుగుచెందిన బాధిత రైతు నడిరోడ్డుపై సర్వేయర్‌ను నిలదీశాడు. ఇచ్చిన డబ్బులు వెనక్కు ఇవ్వాలని సర్వేయర్ ద్విచక్రవాహనానికి అడ్డుగా నిలబడ్డాడు. నడిరోడ్డుపై ఈ తతంగం జరుగుతున్నా ఎలాంటి భయం లేకుండా ఆ సర్వేయర్ ధీమాగా వాహనంలో కూర్చొని దబాయించాడు. ఈ దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. సర్వేయర్ వ్యవహారంపై పలువురు బాధిత రైతులు గ్రీవెన్స్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశాడు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఇంతవరకు ఆయనపై ఎలాంటి చర్య తీసుకోలేదు. కేవలం షోకాజ్ నోటీసుతోనే సరిపెట్టారన్న విమర్శలు వినపడుతున్నాయి. సర్వేయర్‌రి వ్యవహారం ఇంతజరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సర్వేయర్‌కు జిల్లాస్థాయి అధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నాయని ఆధీమాతోనే ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని అక్రమాలకు పాల్పడుతున్న సర్వేయర్ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

28న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మండల పరిధిలోని గొట్లూరు గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద ఈనెల 28నఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎఐఎఫ్‌బి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిడిమామిడి విష్ణు నారాయణ తెలిపారు. కిమ్స్ సవేరా హాస్పిటల్-అనంతపురం వారి సహాయ సహకారములతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో గుండెనొప్పి, చాతినొప్పి, గుండె దడ, ఆయాసము, కళ్ళు తిరగడం,గుండెలో మంట కలగడం, ఛాతిలో బరువుగా ఉండడం ,నిద్రలో ఆయాసం వచ్చి లేచి కూర్చోవడం తదితర సమస్యలకు నిష్ణాతులైన వైద్యులచే వైద్య చికిత్సలను అందించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తచెరువు : మండల పరిధిలోని కేసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ హిందీ పండిట్ మురెడ్డి గారి నాగిరెడ్డి జ్ఞాపకార్థం శంకర నేత్రాలయం వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ,కంటి పరీక్షలు ఈనెల 28వ తేదీ నుంచి జనవరి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మొరెడ్డి గారి కుటుంబసభ్యులు ఆదిశేషారెడ్డి, పురుషోత్తం రెడ్డి తెలిపారు ఈ ఉచిత వైద్య శిబిరం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు నిర్వహించ బడుతుందన్నారు. గ్రామీణ ప్రాంత వాసులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు

కబ్జాదారులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అమడగూరు మండలం జౌకుల కొత్తపల్లి పంచాయతీలోని హరిపురం గ్రామానికి వెళ్లే రహదారిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్లో డిఆర్‌ఒ విజయ సారధికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులు పూర్వం నుంచి రాస్తాలో రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఆరు నెలల క్రితం వైసీపీకి చెందిన క్రిష్టప్ప అనే వ్యక్తి రాస్తాను ఆక్రమించుకున్నాడన్నారు. అప్పటినుంచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను తహశీల్దార్ దృష్టికి తీసుకు వెళ్ళగా సర్వేయర్ ను పంపుతామని చెప్పారే తప్ప పంపలేదన్నారు. దీంతో గ్రామస్తులకు దిక్కు తోచడం లేదన్నారు. ఉన్నతాధికారులైనా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గంగాధర్, గంగులప్ప, శంకరప్ప, తిమ్మప్ప, కృష్ణయ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైవిఆర్ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి ముదిగుబ్బ

మండలంలోని వైవీఆర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా చేస్తామని తహశీల్దార్ నారాయణస్వామి మాట్లాడుతూ నీటి విడుదలతో ఇందుకూరు, దొరిగల్లు, మర్తాడు, కొడవండ్లపల్లి, నక్కలపల్లి, నాగలగుబ్బల, అడవిబ్రాహ్మణపల్లి, ఏబిపల్లితండా, బండ్లపల్లి గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ప్రవాహం వద్దకు వెళ్లొద్దని చెప్పారు.

శ్మశానవాటిక స్థలం పరిశీలన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని గూటిబైలు గ్రామ శ్మశనవాటిక స్థలాన్ని రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. తహశీల్దార్ దేవేంద్ర నాయక్ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరారు. దీంతో అధికారులు శ్మశానవాటిక కోసం స్థలాన్ని పరిశీలించారు. అప్పటికప్పుడే ప్రభుత్వ భూమిని కేటాయించారు. దీంతో గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచి విష్ణు మూర్తి ,మండల సర్వేయర్ జిలాని, ఆర్ఐ శ్రీధర్, ఫారెస్ట్ అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

మహిళారక్షణ చట్టాల అమలులో విఫలం

శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్


సమావేశంలో పాల్గొన్న రైతులు

ప్రజాశక్తి-హిందూపురం

పాలక ప్రభుత్వాలు మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయకపోవడంతోనే అత్యాచారాలు అధికమవుతున్నాయని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పాలక ప్రభుత్వాలు మహిళా రక్షణ కోసం ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఇందిరా పార్కులో ఐద్వా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దిల్షాద్‌తో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దిల్షాద్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశంలో ఏదో ఒకచోట మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో బిజెపి బలంతో ఉన్న కూటమి ప్రభుత్వంలో సైతం అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. దీనికి సాక్షాత్తు బాలయ్య ప్రాతినిథ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గం లోని చిలమత్తూరు మండలంలో ఇద్దరు వలస కార్మిక మహిళలపై గ్యాంగ్ రేప్ అని అన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేయకపోవడం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసి మహిళలను వంటింటికి పరిమితం చేయాలని ప్రయత్నం చేస్తోందన్నారు. మహిళలను చదువుకు దూరం చేయడం, సతీ సహగమన తదితర పురాతన పద్ధతులను అమలు చేయడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. దీనికోసం భారత రాజ్యాంగాన్ని కనుమరుగు చేసి మను ధర్మ శాస్త్రాన్ని తెరపైకు తీసుకురావడానికి బిజెపి పెద్దలు రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మహిళలందరూ ఐక్యంగా ఉండి ఉద్యమాలు నడిపించాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి అయినప్పటికీ ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఉచిత బస్సు, ఉచిత సిలిండర్, నెలకు రూ.1500, ప్రతి కుటుంబానికి ఇస్తామని అదే విధంగా ఇల్లు, ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీలన్నీ తుంగలో తొక్కారని విమర్శించారు. అనంతరం అందరి సమక్షంలో ఐద్వా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా చంద్రమ్మ, కో కన్వీనర్ గా గంగమ్మ, కమిటీ సభ్యులుగా నాజియా, సరస్వతి, నసీం తాజ్, సుమేరా, సల్మా, షకీల భాను, అరుణమ్మ, శైలజ, సానియా, హసీనా తదితరులను ఎన్నుకున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి





పుట్టపర్తి, ధర్మవరం మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని అందుకు సంబంధించి జీవో విడుదల చేయాలని సిఐటియు మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్లు పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని గతంలో ఆందోళనలు చేపట్టామన్నారు. అప్పట్లో ఇచ్చిన హామీలపై జీవో విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పుడా, మున్సిపల్ కార్మికులకు పనిముట్లు పంపిణీ చేయాలని, హెల్త్ అలవెన్స్ విడుదల చేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి కారుణ్య నియామకం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు నాగార్జున, రామయ్య, నరసింహులు, పెద్దన్న, గోవిందు, సాయి తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరం రూరల్ : మున్సిపాలిటీ ఇంజినీరింగ్ సెక్షన్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు మండల కన్వీనర్ జె వి రమణ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ సెక్షన్ అవుట్‌సోర్సింగ్ కార్మికులసంఘం అధ్యక్షులు బొగ్గు నాగరాజు,సెక్రటరీ జయకృష్ణ, బాబు, అనీల్ తదితరులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రిని వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ విజయసారథికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పటాన్ గౌస్ భాషా, మోహన్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను కించపరిచి దళితుల బడుగు బలహీన వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా అమిత్ షా పార్లమెంట్‌లో మాట్లాడడం ఆయన అహంకారానికి నిదర్శనం అన్నారు. అలాంటి వ్యక్తిని ప్రధాని కూడా సమర్థించడం శోచనీయమన్నారు. బిజెపి మూడవసారి కేంద్రంలో అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని లేకుంటే మంత్రి పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.


తిప్పేపల్లి వరిపొలాల్లో విదేశీపక్షులు

తిప్పేపల్లిలో సైబీరియన్ పక్షులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

సైబీరియా పక్షులు మండల పరిధిలోని తిప్పేపల్లి గ్రామ పొలాల్లో విహరిస్తున్నాయి. వరి నాట్లు వేస్తున్న పొలాల్లో విహరిస్తూ కనువిందు చేస్తున్నాయి. వేలకిలోమీటర్ల దూరంలో ఉన్న సైబిరియాదేశం నుంచి తిప్పేపల్లికి వచ్చిన పక్షులు తమ పొలాల్లో విహరిస్తుండటంతో రైతులు ఆదృశ్యాలను చూస్తూ తన్మయం చెందుతున్నారు. వరి నాట్లు వేసిన మొదటి వారంలోనే స్థానికంగా వుండే తెల్ల కొంగలు, గుడ్డి కొంగల తో పాటు, నల్ల మెడ సైబిరియా కొంగలు విహరిస్తున్నాయి.

ప్రజలపై భారాలు తగదు : సిఐటియు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

పేద మధ్యతరగతి ప్రజలపై భారాల మోపడం ప్రభుత్వానికి తగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే టిడిపి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. రైతులకు, ప్రజలకు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని లేకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే నిత్యవసరాల వస్తువులు ధరలు భారీ ఎత్తున పెరగడంతో ప్రజలు కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నారని తెలిపారు. ఉపాధి పనులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అలాగే కొత్తచెరువు ధర్మవరం రోడ్డు నందు దాల్ మిల్ వెనుక, ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగంలో 150 మంది సంచార జాతులు చెందిన వ్యక్తులు గుడారాలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. గుడిసెలో నివసిస్తున్న వారికి హక్కులు కల్పించాలని పలుమార్లు కోరామన్నారు. వారికి ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ బాలాంజినేయులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ముత్యాలు, కో కన్వీనర్ శంకర్ రెడ్డి, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

పది మోడల్‌పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కటారపల్లి కేజీబీవీ, నీరుకుంట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన మోడల్‌పేపర్లను పంపిణీ చేసినట్లు ఆసంఘం జిల్లా నాయకులు డి శ్రీనివాసులు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడ్డు వెలగల పంచాయతీ మాజీ సర్పంచి బి ప్రసాద్ సహకారంతో దాదాపు 40 మంది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆజాంబాషా, లక్ష్మీప్రసాద్, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి కళాశాలలో మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనవరి 3వ తేదీ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్లత తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ పథకం అమలు అవుతున్నందున వంట పాత్రల కోసం వదన్య జన సొసైటీ ఫౌండర్ పడపాటి అశోక్ ప్రిన్సిపల్‌కు 20వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చంద్రమౌళి, నారాయణస్వామి, రవీందర్ రెడ్డి, అటెండర్ ఏర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి చేయూత

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

అంగన్వాడీ కేంద్రాలను ప్లేస్కూల్ మోడల్‌గా మార్చేందుకు తమ సంస్థ సహాయ సహకారాలు అందిస్తోందని మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ లక్ష్మిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని సత్యసాయినగర్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఎస్‌బిఐ పాన్ ఇండియా సీఎస్‌ఆర్ యాక్టివిటీస్ సహకారంతో మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ లక్ష్మిరెడ్డి అంగన్వాడీ కేంద్రానికి ఆట వస్తువులు, బుక్స్, బాటిళ్లు, టీవీ, రైస్ కుక్కర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు ఆడుతూ పాడుతూ విద్యను అందించేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. సొసైటీ తరపున ఇప్పటి వరకు రాష్ట్రంలోని 60 అంగన్వాడీ కేంద్రాలకు ఆట వస్తువులు, వివిధ రకాల వస్తువులు అందించామని తెలిపారు. కేంద్రంలోని పిల్లలు, టీచర్లు వాటిని సద్వినియోగం చేసుకుని పిల్లలకు మంచి విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయినగర్ అంగన్వాడీ కేంద్రం టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప మండలపూజ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని బెంగళూరు రోడ్డులోనిఅయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం మండల పూజ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుండి దేవాలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. హిందూపురం డిఎస్‌పి కెవి మహేష్ మండల పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు, ఆలయ కమిటీ ప్రతినిధులు, మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేబుల్ పనులతో పగిలిన తాగునీటి పైపులైన్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో టెలి కమ్యూనికేషన్‌కు సంబంధించి కేబుల్ వైరును భూమిలో వేయడానికి గుత్తేదారు కణేకల్లు-బళ్లారి ప్రధాన రహదారికి ఇరువైపులా జెసిబి సాయంతో గుంతలు తీశారు. ఈ క్రమంలో ఈ మార్గంలో దేవగిరి నుంచి బొమ్మనహాల్‌కు ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా పైపులైన్ పగిలిపోయింది. దీంతో నీరు లీకేజీ అవుతూ ప్రధాన రహదారి పొడవునా ప్రవహించడంతో బురద మయం కావడంతో పాటు పెద్దఎత్తున తాగునీరు వృథా అవుతుంది. కేబుల్ పనుల వల్ల పైపులైన్ పగిలిపోయి నీరు వృథా అవుతుందని గ్రామస్తులు మండిపడుతున్నారు.

అంగన్వాడీ కేంద్రం వద్ద చెత్తకుప్ప

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మండలంలోని వెంగళమ్మ చెరువు పంచాయతీకి చెందిన వీరాంజనేయపల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం వద్ద చెత్తచెదారం పేరుకుపోయింది. చెత్త కుప్ప నుంచి దుర్వాసన వెదజల్లుతుందని, దోమలు వృద్ధి చెంది ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాల్లో జోరుగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని ప్రతి గ్రామంలో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్యం బాబుల జేబులకు చిల్లు పెడుతున్నట్లు తెలుస్తోంది. సుమారు 42 బెల్టు షాపుల్లో అధిక ధరలు వసూలు చేస్తున్నారని మందుబాబులు సైతం వాపోతున్నారు. పల్లెల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ మద్యం అందుబాటులో ఉండడంతో రోజంతా కూలి నాలి చేసి సంపాదించిన డబ్బును మొత్తం మగవారు మద్యం తాగేందుకే ఖర్చు పెడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బెల్టు షాపులను ఎత్తి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సిఐ లక్ష్మీదుర్గయ్యను వివరణ కోరగా మండలంలో ఎక్కడా బెల్టు షాపులు లేవని, ఎవరైనా నిర్వహిస్తే సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచామని కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మడకశిర బస్టాండులో చినుకు పడితే చిత్తడే

ప్రజాశక్తి-మడకశిర రూరల్

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. బస్ షెల్టర్ లేకపోవడంతో చినుకు పడితే నీరు నిలవడంతో విద్యార్థులు, ప్రయా ణికులు నానా అవస్థలు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి నియోజకవర్గ కేంద్రానికి ప్రజలు రోజూ వస్తూ ఉంటారు. వేలాది మంది ప్రయాణికులు ఈ బస్టాండ్ ద్వారా రాకపోకలు సాగిస్తున్నా ఆర్టీసీ అధికారులు కనీసం షెల్టర్ ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని ప్రయాణికులు మండిపడుతున్నారు. వర్షం కురిస్తే ప్రయాణికులు బస్టాండ్ సమీపంలోని దుకాణాలు, చెట్ల కిందకు వెళ్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో షెల్టర్‌తో పాటు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.